



# ఎలక్షన్లొచ్చాయి

'కూలి గుర్తుకే మీ ఓటు!'

'చెమట చుక్కకే మీ ఓటు!'

'శ్రమ శక్తులకే మీ ఓటు!!'

నినాదాల బోర్డులు తగిలించుకుని యువకుల సైకిళ్ళు కదులుతున్నాయ్. ఉదయం నుండి చుట్టు పక్కల గూడేలల్లో ఎన్నికల ప్రచారం చేసి చేసి అలసిపోయిన యువకులు తిరిగి యిళ్ళకు చేరుకుంటున్నారు. కొద్ది రోజుల్లోనే ఎన్నికలు—

బలవంతుడైన ప్రత్యర్థిలాగా ఎదురుగాలి. సైకిళ్ళ చక్రాలు బరువుగా. కష్టంగా కదులు తున్నాయి.

అనవసరంగా ఎదుటి వాడు సృష్టించే సమస్యల్లాగా- అడ్డం తగులుతున్న గొర్రెలు, బర్రెలు, దున్నలు మొదలయిన పశువులు.

వూళ్ళోకి చేరుకుంటూ వుండగా మైకు శబ్దం వినిపించింది.

ఎవరో ఉపన్యసిస్తున్నట్లుగా వుంది. యువక బృందం నేరుగా ఉపన్యాసం కోసం సమావేశం జరుగుతున్న చోటుకి వెళ్ళారు.

వేదిక నుండి పరంధామాచారి మాట్లాడు తున్నాడు. ఆశ్చర్యం కలిగించే విశయమది. పరంధామాచారి రాజకీయాల్లోకి ఎలా దిగాడో తెలియదు. అతనికి కూడా పదవి కావాలని ఎందుకనిపించిందో తెలియదు. నాలుగు రోడ్లు కలిసిన చోట, నాలుగు బల్లపీటలు వేసి, వేదిక తయారు చేశారు. వేదిక మీద స్తంభాలకు ఎలక్ట్రిక్ బల్బులు వేలాడ దీశారు. ఎక్కడెక్కడి నుండో వచ్చి చేరిన జనమంతా కిక్కిరిసి నిలబడ్డారు. పరంధామా చారి మాట్లాడు తున్నాడు. యువకులు సైకిళ్ళకు స్టాండ్లు వేసి నిలబడ్డారు.

"...మీకు తెల్సు- ఇన్నేండ్లు ఇందిరారెడ్డి చేసిన నిర్వాకం. ఇగ గిప్పుడు తెల్సి కూడ మల్ల ఆయినకే ఓటేసి గెల్పిస్తిరాంటే- పరిగి కంపను అంటించుకున్నట్టే గదా! నేజెప్తున్నని గాదు, మీకు మీరే ఆలోచన జేయుండ్రి. ఆయిన తండ్రి వూర్లకు వూర్లు దోస్క-తినోడే, ఈ రోజు దాక ఇంద్రారెడ్డి తిన్నడే. రేప్పొద్దున ఆయిన కొడుకు గూడ దేశాన్ని ఏడికాడికి దోసుక తినెటోడే గని వట్టోడు గాడు. అయితే ఇండ్ల, నేనన్నదాంట్ల వాజిబి ఉన్నదా లేదా? యధార్థమున్నదా లేదా? అని మీరు అలోచన జేస్తె తెలుస్తది. మొన్నటికి మొన్న వూళ్లె ఓయిసు పోరగాళ్లందరు ఏం జేశిన్రు? కమేటి జేశిన్రు. ఏం కమేటి అంటే- ఎప్పుడు పెద్ద పెద్దోళ్లు దొరలు వీలే గద్దె లెక్కాల్నా అనుకోని బీదోళ్ల పక్షం నుండి జగన్నాధంను నిలబెట్టిన్రు. మంచిది. కని రేప్పొద్దున జగన్నాధం ప్యాదోళ్లకు దారి జూపుతడా? సూపడు. సూపలేడని నేను బల్లగుద్ది శెప్పగల్గుతున్ననంటె, ఇగ మీరు ఆలోచన జేయ్యాలె. జగన్నాధం పిలగాడు అనుభవం తక్కువ. అయినకు లోకం సంగతి తెల్వాదు. ఎన్నెన్ని

మోసాలయితరయీ అయినింక గ్రయించలేదు. కానీ నాకు తెల్సు. పేదోల్ల బాదలు. నేను ఖుద్దు పేదగ పుట్టిన- పేదగ పెరిగిన. ఇప్పుడు అల్లకోసమే కంకనం కట్టుకున్న. ఈడ ఈ మీటింగుల నేను చెప్పేది, కోరేది ఒక్కటే- మర్యాదగ ఇంద్రారెడ్డి తప్పుకునెహా మంచిదె. లెకుంటె శిగ్గు శరము లేదని తెలిపోతది. ఆయననిట్ల తిడుతానని ఆయనకు ఎక్కజేశె మనుషులు ఈ మీటింగుల లేరని కాదు. ఉన్నరు, ఉంటె ఉన్నారు. నాకేం ఫర్వాలేదు నిజం మాట్లాడ్తాన. నిజం ఎక్కన్నన్న బయపడ్తాది? బయపడదు. అది ఆయిన అయ్య సొమ్మా. తాతసొమ్మా ఎన్నేం డ్లుంటడు గద్దె యిడువక? నా వొల్లంత మసుల్తది, ఇవ్వన్ని యాది జేసుకుంటె— సుట్టు పతి వూల్లె నుంచి, బడి గట్టియ్యాలని చందాలు ఒసూలు జేస్తె సొమ్మంత మింగి కూసునె—''

ఉపన్యాసం సాగుతూ వుంది.

యువకులు సైకిళ్ళు తీసుకుని బయలుదేరి కొంత దూరంలో గుమిగూడారు. ఎవరి సంగతీ పట్టించుకోకుండా వుండే పరంధామా చారి ఈ రంగంలో కెట్లాదిగాడో, ఆయన్ను బలపరుస్తున్నది ఎవరో? అర్థం కాలేదు. కనీసం విమర్శించలేని స్థితిలో వుంది. ఇంద్రారెడ్డిని అలా సభలో తిడుతున్నాడంటే. ఎంత బలంగా నిలబడ్డాడో తెలుస్తూంది. దీనితో మరి జగన్నాధం విశయం ఆలోచించాల్సిందే. ఏది సాధించడానికి తాము జగన్నాధాన్ని నిలబెట్టారో— దాని సాధనకే పరంధామాచారి నిలబడుతున్నా నంటున్నాడు, మరి యితన్ని బలపర్చడమా వద్దా? మానిపించడమా? యిదో సమస్య తయారయింది. ఇన్ని రోజుల కృషి ఫలితంగా జగన్నాధం పలుకు బడి బాగా పెరిగిపోయింది. చెప్పలేక పోయినా, ఎన్నేళ్ళు గానో పదవిని కాపాడుకుంటూ తిష్ట వేసిన మనిషి మారాలని, మార్పులు రావాలని, బ్రతుకులో కొత్తదనం కావాలని

ప్రజలు కోరుకుంటున్నారు. ఏ గొడవలూ లేకుండా ఎన్నికలు జరిగితే జగన్నాధం గెలవడం తప్పదు. మరి పరంధామాచారి విశయం?... యువకుల చర్చ ఇలా చాలా విశయాల మీద చాలాసేపు జరిగింది.

మంచిగా మాట్లాడ్డం అయిపోయి, పరంధామాచారి ఇందిరా రెడ్డిని బూతులు తిడుతూ ఉండడం మైకులో వినిపిస్తోంది.

నిశ్శబ్దంలో మెలకువ వచ్చింది, పరంధామాచారికి. చేతి గడియారం చూసుకున్నాడు, గడియారం ముండ్లు మెరుస్తు న్నాయి. రాత్రి పన్నెండున్నర దాటింది. ఇంక గంట రైకుంది, యింద్రా రెడ్డి దొరను కల్సె తానికి- అనుకున్నాడు. చుట్టూ చూశాడు. ఈ మసక చీకటి తన బ్రతుకు లాగ ఉందనుకున్నాడు. ఆ మూల చింకి చాప మీద జాగ్రత్తగా చెట్టు మీదేగుడ్డతో కట్టి పెట్టిన దానిమ్మ పళ్ళలాగా, ఎదిగిన బిడ్డలిద్దరూ తల్లి పక్కన నిద్రలో వున్నారు. సరైన పెట్టుపడి లేక ప్రతి ఏడూ ఎండి పోతూ పోతూ ఎదుగుతున్న జబ్బు వరిచేను లాగా, చిన్నవాళ్ళు కొడుకులు ముగ్గురు, నులక మంచం జోలెలో కుప్పగా గుర్రు కొడ్తున్నారు. ఒకమూల గుడ్డి దీపం ఏదో కొద్ది వెలుగు ఉత్పత్తి చేసే ప్రయత్నం చేస్తూంది.

పరంధామాచారి లేచి మెల్లగా దీపాన్ని పాత ట్రంకు పెట్టిపైపు తీసుకెళ్ళాడు. పెట్టె తెరిచాడు, నోట్ల కట్టలు కనిపించాయి. ముందు ముందు బ్రతకడానికి ఆశ కనిపించినట్లయింది. ఇందిరారెడ్డి దొర ఆశీర్వాదం దొరికినట్లు సంతోషంగా వుంది. ఎప్పటిలాగా పెట్టెకు తాళం వేసి, నిశ్శబ్ధంగా ఇంట్లోంచి బయటపడ్డాడు. బయటంతా చీకటి.

ఎన్నికలలో జరగబోయే మోసాల్లాంటి చీకటి. నమ్మించి, తడిబట్టలతో గొంతులు కోయగల వాగ్దానాల లాంటి భయంకరమైన చీకటి. చీకటిని చూసి భయపడ లేదు జడుసుకో లేదు. చీకటిని చూసి చీకట్లో చీకటిగా

సంతోషించాడు, పరంధామా చారి- వెలుగులో బ్రతుకు దామని వెలుగునే జీర్ణించుకుం దామని అనుకున్న పరంధామారి జీవితంలో వెలగలేక, వెలిసి పోయిన బ్రతుకునైనా కాపాడుకుందామని క్రమంగా చీకటి మింగడం అలవాటు చేసుకున్నాడు. చీకటి అలవాటయిన వాళ్ళను చీకటి భయ పెట్టదు. అందుకే పరంధామాచారి చీకట్లో చేయబోయే చీకటి పనికి భయ పడలేదు. దారిలో చీకటిపై ఓ కన్ను వేసి కాపలా కాస్తూ నిలబడ్డ వెలుగు కాపలా దారులు—వీధి దీపాల్ని చూసి, గజగజా వణికి పోయి, మొహం కప్పుకుని 'సాయంత్రం మీటింగుల దొరను తిట్టవల్సి వచ్చె గదా!' అని విచారిస్తూ త్వరత్వరగా అడుగులు వేసాడు.

రెడ్డి యింటి గేటు దాటి లోపలికి వెళ్ళగానే, ఇద్దరు మనుషులు న్నారు. అల్సేషియన్ కుక్కలు పులులాగా భయంకరంగా తిరుగుతు న్నాయి. కుక్కలాగానే మనుషులు కూడా బలిష్టంగా భయంకరంగా వున్నారు. కుక్కల్ని మందలించి అదుపులో పెట్టి, పరంధామాచారిని లోపలి కెళ్ళమని సైగచేశారు. మెట్లెక్కి ముందు వసారా దాటగానే, లోన గదిలో దొర కనిపించాడు. నిద్రపోయినట్టు లేదు. నీలిరంగు బల్బు వెలుగుతూవుంది. దాని-క్కూడా ఎన్నో రాత్రుల్నుండి నిద్రలేదు, బల్బును వేలాడదీస్తూ గదిపై కప్పునుండి క్రిందికి సాగిన ఎలక్ట్రిక్ వైర్ చిరుగాలికి మత్తుగా ఊగుతోంది. దొర గారి మెదడులో రాజకీయపు ఆలోచనల్లాగా ఎలక్ట్రిక్ వైర్లు ఒకదాన్నొకటి అలుకుని పైకి అందంగా కనిపిస్తున్నాయి. అతని ఆలోచనలు ఎవరిని షాక్ చేస్తాయో తెలియదు. అతను సోఫాలో నిండుగా విగ్రహంలాగా నిండిపోయి వున్నాడు. పక్కనే టేబుల్ మీద మందు తాగిన ఎర్ర సీసాలు కనిపిస్తున్నాయి. మసాలా వాసనకు అకారం వచ్చినట్టుగా ప్లేట్లో ముక్కలు ఉన్నాయి. (ఆ మాంసం ముక్కలు ఏ జీవాలయో చెప్పడం కష్టం.)

'ఆఁ- చారిగారు ఒచ్చిన్రా. మీ కోసమే ఎదిరి చూస్తాన. ఇంక రాకపోతివని...కొంచె మేసుకుంటవా?'- కళ్లెగరేస్తూ అడిగాడు యింద్రా రెడ్డి.

'అయ్యయ్యో నాకెందుకు అలవాట్లేంది?' ఇబ్బందిగా మొహం పెట్టాడు, పరంధామాచారి. 'నిన్న రాత్రి మీరు జెప్పినట్టుగానే సాయంత్రం మీటింగ్ల మిమ్ముల దిట్టిన మిమ్ములను నా నోటితోని తిట్టిపిస్తిరి. ఇంత పాపం నాతోటి జేపిస్తిరి.' చెంపలేసుకున్నాడు.

'ఇగో-ఒజ్రాన్ని కాలుతోని తన్నంగనె గాజుముక్కయితదయా? ఏం మాట్లాడ్తవ్? నువ్ తిట్టంగనె నాకేమైన అంటెనా- నీ ఈపు మీదేమన్న బరువు పడెనా? ఎలక్సన్లల్ల గివ్వన్ని మామూలె. నీకేం ఫర్వాలేదు. పరేశాను గాకు. యిన్నవా? నాకొచ్చే ఓట్లంటవా? ఎట్లనన్నాస్తయి- రాకపోయే పక్షంల పైసలు గుప్పైయిన నేను రాబట్టుకుంట. జగన్నాథం దగ్గర్నా పైసల్లేవ్వు. పబ్లికు దయాధర్మం భయాభక్తి-ఎన్నాఇన్ని ఓట్లు వొస్తుడొచ్చు. రావు అని నేనెట్లంట గన్క?-

ఇగనువ్వు జేసే దేందంటే జగన్నాథం గాని ఓట్లల్ల నుంచి సగం నువ్వు రాబట్టాలె. దానితోటి ఆనికి మెజారిటీరాదు రానియ్యొద్దు! అదీ కావల్సింది. యిన్నవా? నీకు ముందుగాలనే జెప్పినట్టు నిన్న రాత్రి పైకం యిచ్చిన. ఇచ్చిన్నా లేదా?- ఇచ్చిన ఎలక్షన్లయి నేను గెలిస్తినా సంతోషం కొద్ది యింకేమన్న ఇస్త! రేపొద్దున మంత్రిని గిట్లయితే నీకు ఏది గావాలన్నా సాయం జేసెటోన్ని నేన్ గని ఆల్లుగాదు. బస్తీలల్ల గింత సదువుకొని రాంగనె మేం పెద్ద మన్సుల మయినమని తెల్వి అంత సూపెట్టకుంట తిరుగుతాండ్రు గని, అల్ల సంగతి ఎవన్కి ఎర్కలే? అడివిల గుంటెడు జాగలేదు. పూల్లె గింత యిల్లులేదు. ఈల్లంత ఒక్కటయి నన్నేమో జేస్తరంట!!! ఏం జేస్తరో చూస్త- ఇగో మర్సిపోకు.

అల్లతోని కాంప్రమైజు కావద్దు. చెపుతున్న, నాకు ఎదుట పక్షంల ఉండాలే గని జగన్నాథంతోని కలువొద్దు. అనితోటి కల్సినట్టే ఉండాలె గని. అనివోటు నీ దిక్కుమల్పుకోని అడు యిగమల్ల లేవకుంట దెబ్బ దియ్యాలె. యింటున్నవా? నీకు ఎక్కువ జేప్పేదేమున్నది. నువ్వేం తక్వోనివా? సమజ్ దారోనివే ఇగమరి ఫో మరి జల్దిన ఈడ శానసేపుంటె గూడ బాగుండదు లేనిపోనిది ఏదన్నా రాగాల,'

ఇందిరారెడ్డి హితబోధ పూర్తయింది. గ్లాసు లేపాడు పరంధామాచారి కూడా లేచి నమస్కారంచేశాడు. అక్కడి నుండి కదిలాడు. వీధిలోకొచ్చి భయంభయంగా అటూఇటూ చూశాడు. ఎవరూలేరని నిర్ణయించుకున్నాక, అడుగు వేయడం మొదలెట్టాడు...

మట్టిరోడ్డు మీద దుమ్ము మెత్తగా నిశ్శబ్దంగా వుంది.

కుట్రల్నీ, కుతంత్రాల్నీ, మోసాల్నీ, అన్వేషిస్తూ. ఛేదిస్తూనిద్ర లేని ఈదురు గాలిలాగా తిరుగుతున్న యువతరం అడుగుల శబ్దం సైతం నిశ్శబ్దంలోంచి వినగలిగింది.

ముందునడుస్తున్న రెండడుగుల జాడల్ని నాశనం చెయ్యడానికి వెనక పది అడుగులు పడుతున్నాయి. చీకటి నోరు మూసుకున్నట్లుగా వుంది,

ఈదురుగాలి లేపిన దుమారానికి దుబ్బలేచి పరంధామాచారికళ్ళలో పడింది. అతని అడుగులు ఆగిపొయ్యాయి.

వెంబడిస్తున్న నవతరం అడుగులు ఆగలేదు.

జయశ్రీ
4-4-1977